వార్డు కార్యాలయాల్లో కౌంటర్ల ఏర్పాటు

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించ నున్న ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించ నున్న విషయం తెలిసిందే. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్లలోని వార్డు కార్యాలయాల్లో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. సెలవు దినాలు మినహా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కౌంటర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందించారు.. నివేదిక పంపారు

సాక్షి ఎఫెక్ట్..

చింతల్: 'పైపులైన్ లీకేజీలు.. పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయమే లీకేజీ ఏర్పడిన ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. మరమ్మతులు చేపట్టేందుకు.. రోడ్డు తవ్వకాలు చేపట్టేందుకు అవసరమైన నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు తవ్వకం అనుమతుల ఆలస్యం కావడంతోనే లీకేజీ మరమ్మతులు ఆలస్యమైనట్లు సమాచారం.

2 ఒకే నిర్మాణానికి 6 త్రీ-ఫేజ్ సింగిల్ ఫేజ్ విద్యుత్ మీటర్లు!



కంచె చేను మేస్తే..? అన్న చందంగా తయారయ్యింది విద్యుత్ అధికారుల తీరు. విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం ఒక నిర్మాణానికి 4 విద్యుత్ మీటర్ల ఏర్పాటుకే అనుమతి ఉంటుంది. అంతకు మించి మీటర్లు బిగించాల్సి ఉంటే ప్యానెల్ బోర్డు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్యానెల్ బోర్డు ఏర్పాటుకు కొంత మొత్తంలో విద్యుత్ శాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆ నింబంధనలను తుంగలో తొక్కి స్థానిక లైన్‌మెన్ ఏకంగా 8 విద్యుత్ మీటర్లను బిగించి అందినకాడికి దోచుకుంటున్న విషయం వెలుగులోకి వచ్చింది.

ప్యానల్ బోర్డు ఏర్పాటు చేయకుండా ఇది ఎలా సాధ్యమంటున్న పలువురు


ఇదే విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఏడీఈ డివిజన్ పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో ఉండే సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో ఆ నిర్మాణానికి లైన్‌మెన్ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించి రెండు త్రీ-ఫేజ్ మీటర్లతో పాటు మరో ఆరు సింగిల్ ఫేజ్ మీటర్లను మంజూరు చేసి నిబంధనలను తుంగలో తొక్కారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఈ నిర్మాణాన్ని పరిశీలించిన పలువురు విద్యుత్ అధికారులకు మీటర్ల ఏర్పాటుపై ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారి ఆధ్వర్యంలోనే మీటర్ల బిగింపు తతంగం నడిచిందనిపు కార్లుషికార్లు చేస్తున్నాయి.

విద్యుత్ శాఖ ఆదాయానికి గండి..

నాలుగు విద్యుత్ మీటర్ల కంటే అధికంగా ఉంటే ప్యానెల్ బోర్డు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలి. ఆ తర్వాత విద్యుత్ శాఖకు కొంత మొత్తం డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అధికారులు అనుమతి ఇచ్చిన తర్వాతనే విద్యుత్ మీటర్లు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా స్థానిక లైన్‌మెన్ ఓ ఉన్నతాధికారి అండదండలతో మీటర్లు మంజూరు చేస్తున్నాడు. రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని విద్యుత్‌శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పుడు ఈ విషయం వెలుగులోకి రావడంతో దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ ఏడీఈ సత్యనారాయణను 'సాక్షి' వివరణ కోరగా ఇప్పుడే ఫోన్ చేస్తా అని పెట్టేయడం గమనార్హం.





ప్యానెల్ బోర్డు లేకుండా బిగించిన విద్యుత్ మీటర్లు ఇవే..

నిద్రపోతున్న నిఘా.. విజిలెన్స్ జాడెక్కడ?

కుత్బుల్లాపూర్ ఏడీఈ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు దొంగచాటుగా మీటర్లు బిగిస్తున్నా విజిలెన్స్ అధికారులు మాత్రం చోద్యం చూడటం పలు అనుమానాలకు తావిస్తోంది. దండమూడి ఎంక్లేవ్ కాలనీలో తనిఖీలు చేపడితే అక్రమంగా మంజూరు చేసిన మీటర్ల బాగోతం బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు..

ఫిర్యాదు వచ్చిన సందర్భంలో తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి వెళ్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మీటర్ల మంజూరు, ప్యానెల్ బోర్డు ఏర్పాటు విషయంపై దృష్టి సారించకపోవడంతో లైన్‌మెన్లు రెచ్చిపోతున్నారనేది ప్రధాన ఆరోపణ. లక్షలాది రూపాయలు విద్యుత్ శాఖకు రావాల్సిన నిధులు పక్కదారి పట్టడం వెనుక విద్యుత్ ఉన్నతాధికారుల పాత్ర ఉండటం విశేషం. ఏది ఏమైనా ఇక్కడ జరుగుతున్న అవినీతి బాగోతంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే మరిన్ని అక్రమ మీటర్ల బిగింపు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నాం



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం శంభీపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానికంగా డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు తదితర వసతులు కల్పించాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

– దుండిగల్ మున్సిపల్ పరిధి మల్లంపేట్ శ్రీహనుమాన్ దేవాలయంలో జరిగిన అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పకు ముడుపులు చెల్లించి శబరిమలై యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయాలని అభిలాషించారు.

కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పూర్వవైభవం తీసుకొస్తాం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



మంత్రిని కలిసిన నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకొస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. నిజాంపేట మున్సిపాలిటీకి చెందిన పలువురు బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అధికార ప్రతినిధి భవానీరెడ్డి, భూపతిరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో జరగబోయే గ్రేటర్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో వాసు, సాంబశివరావు, రవిందర్ బాబు, రాజేందర్‌బాబు, వీరయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన భూపతిరెడ్డి..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాపాలన కార్యక్రమానికి సర్వం సిద్ధం

నేటి నుంచి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

రంగారెడ్డినగర్: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూకట్‌పల్లి జోన్ కమిషనర్ మమత అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జోనల్ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్, కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఐదుగురు స్పెషల్ ఆఫీసర్లు, ప్రతి సర్కిల్‌కు ఇన్‌చార్జ్‌గా డిప్యూటీ కమిషనర్, డివిజన్ నోడల్ అధికారులు, ప్రతి సెంటర్‌కు టీమ్ లీడర్, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు ఆయా వార్డు కేంద్రాల్లో దరఖాస్తు స్వీకరణ కౌంటర్లను అందుబాటులో ఉంచారు.

నేడు దరఖాస్తు చేసుకోవాల్సిన బస్తీలు ఇవే..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

- గాంధీనగర్ కమిటీహాల్‌లో గాంధీనగర్, గురుమూర్తినగర్ కమిటీ హాల్‌లో గురుమూర్తి నగర్, ఆదర్శనగర్ కమిటీ హాల్‌లో ఇందిర గాంధీనగర్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో రంగారెడ్డినగర్.

సుభాష్‌నగర్ డివిజన్..

- సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో భాగ్యలక్ష్మి కాలనీ, ఎస్‌ఆర్ నాయక్ నగర్ కమిటీ హాల్‌లో మరాఠీ బస్తీ, అపురూపా కాలనీ కమిటీ హాల్‌లో అపురూపా కాలనీ, సూరారం లూయిస్ బ్రెయిలీ భవనంలో సూరారం కాలనీ.

కుత్బుల్లాపూర్ డివిజన్..

- పద్మనగర్ ఫేజ్-2 కమిటీ హాల్ పద్మానగర్ ఫేజ్-2, మాణిక్యనగర్ కమిటీ హాల్‌లో మహేంద్రనగర్, వాణినగర్ వినాయక మండపంలో చెరుకుపల్లి ప్రతాప్‌రెడ్డి కాలనీ, కల్పన సొసైటీ హాలులో చెరుకుపల్లి కాలనీ.

జీడిమెట డివిజన్..

- ప్రసూననగర్ కమిటీ హాల్‌లో ప్రసూననగర్, దుర్గా ఎస్టేట్స్ కమిటీ హాల్‌లో జీడిమెట్ల గ్రామం, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజెన్స్ భవనంలో కుత్బుల్లాపూర్ గ్రామం, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో యాదిరెడ్డిబండ.

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

- గాజులరామారం వార్డు కార్యాలయంలో కైలాష్ హిల్స్, ఉషోదయ కాలనీ కమిటీ హాల్‌లో ఉషోదయ కాలనీ, దేవేందర్‌నగర్ కమిటీ హాల్‌లో కైసర్‌నగర్, సుభాష్‌చంద్రబోస్ కమిటీ హాల్‌లో లెనిన్‌నగర్.

జగద్గిరిగుట్ట డివిజన్..

- జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో షిర్డీ హిల్స్, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో దేవమ్మబస్తీ, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో మైసమ్మనగర్ బ్లాక్-ఏ, జగద్గిరినగర్ కమిటీ హాల్‌లో జగద్గిరినగర్.

చింతల్ డివిజన్..

- చింతల్ వార్డు కార్యాలయం, ఎస్‌ఎల్‌బీ నగర్ కమిటీహాల్, శ్రీనివాసనగర్ కమిటీ హాల్‌లో చింతల్ కాశీనాథ్ కల్యాణ మండపంలో చంద్రానగర్.

సూరారం డివిజన్..

- నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో నెహ్రూనగర్, రాజీవ్‌గాంధీనగర్ కమిటీ హాల్‌లో రాజీవ్‌గాంధీనగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో శివాలయనగర్, సంజయ్‌గాంధీనగర్ కమిటీ హాల్‌లో సంజయ్‌గాంధీనగర్.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో పాటు రూ.100 చెల్లించి జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా..



బాధిత కార్మికుడికి నష్టపరిహారాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటూ... వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రంగారెడ్డినగర్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్‌లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్న వ్యక్తి చేతి వేళ్లు యంత్రంలో పడి తెగిపడటంతో బాధితులు కార్పొరేటర్‌ను ఆశ్రయించారు. దీంతో డివిజన్‌కు చెందిన కాప సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి బాధితుడికి రూ.3లక్షల నష్టపరిహారం ఇచ్చేలా ఒప్పించారు. సదరు మొత్తాన్ని బుధవారం కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ చేతుల మీదిగా చేతివేళ్లు కోల్పోయిన కార్మికుడికి అందజేశారు. కార్యక్రమం నాయకులు కార్తీక్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో అంతర్జాతీయ సదస్సు

జనవరి 18 నుంచి 20 వరకు నిర్వహణ

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రపంచ వ్యాప్తంగా, విభాగాలలో విస్తృతశ్రేణి నిపుణులనుఒక చోట చేర్చడానికి ప్రత్యేక ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా జనవరి 18 నుంచి 20వ తేదీ వరకు సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీ)పై అంతర్జాతీయ సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సులో భారత దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పలువురు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు.

ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- అధికారులు, సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లు మల్లయ్య, నాగమణిల అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే హాజరై అధికారులకు దిశానిర్దేశనం చేశారు.

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి పథకాలు ప్రజల దరికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలపై వివరాలు అందించడంలో ఓర్పుతో వ్యవహరించాలన్నారు.
- గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, విజయశేఖర్‌గౌడ్, పారిజాత, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొంపల్లి కార్యాలయంలో సమీక్ష



అధికారులతో సమావేశమైన చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: ప్రజాపాలన కార్యక్రమాలపై బుధవారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ విధి విధానాలను, కౌంటర్లలో దరఖాస్తుల స్వీకరణ, సన్నాహక ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలే.. నీరు ఎగిసిపడే!



సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లి చర్మాస్ రోడ్డులోని తుమార్ చెరువు వద్ద బుధవారం ఉదయం గోదావరి ప్రధాన పైప్‌లైన్ పగిలి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోయింది. గోదావరి నుంచి దూలపల్లి మీదుగా కూకట్‌పల్లి వైపు వెళ్తున్న 3వేల ఎంఎం డయ సామర్థ్యం ఉన్న పైపులైన్ పగిలి 3మీటర్ల ఎత్తు వరకు ప్రెషర్‌తో పెద్ద మొత్తంలో నీరు బయటకు వచ్చాయి. బయటకు వచ్చిన నీరు తుమ్మ చెరువులో గంటల తరబడి పారింది.

ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ సుచరిత, కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ సుచరిత, మున్సిపల్ కౌన్సిలర్ సత్యనారాయణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రతి వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

- మొత్తం 28 వార్డుల్లో ఇప్పటికే టీమ్‌లను నియమించామని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తు ఫారంతో పాటు ఆహార భద్రత కార్డు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను జత చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారి సునంద, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ నర్సింహులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేఎం ప్రతాప్



కేఎం ప్రతాప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరస్పాండెంట్స్

జీడిమెట్ల: బడ్జెట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని మాజీ డీసీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేఎం ప్రతాప్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ సభ్యులు కేఎం ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల బడ్జెట్ పాఠశాలలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం వారు పార్టీ యువ నాయకులు కేపీ విశాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ మల్లేశం, చైర్మన్ శివయ్య, అధ్యక్షుడు ఆర్.వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మహేష్‌కుమార్, చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్‌గౌడ్, లాక వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం బ్రేక్ ఫెయిల్..

చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్



బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో డివైడర్లను ఢీకొట్టి ఆగిపోయిన డీసీఎం

సుభాష్‌నగర్: సరుకుల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌కు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ముందు 44వ జాతీయ రహదారిపై జరిగింది. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో డీసీఎం యాంజాల్‌లోని ఓ గోదాం నుంచి సరుకుల లోడుతో ఉప్పల్‌లోని మెట్రోకు వెళ్తోంది. ఉదయం 7గంటల సమయంలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్దకు రాగానే డీసీఎం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. డ్రైవర్ ప్రభాకర్ చాకచక్యంగా వ్యవహరించి డీసీఎం ముందున్న వాహనాల మీదికి వెళ్లకుండా డివైడర్ల వైపు మళ్లించాడు. దీంతో డీసీఎం ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది.

కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్యగౌడ్

జగదిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, ప్రజాపాలన కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్టలోని పార్టీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపైనే ఉందన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు మంగ, సులోచన, రేవంత్‌రెడ్డి యువసేన నాయకుడు సాయి ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'కు సర్వం సిద్ధం

వచ్చే నెల 6 వరకు ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

- నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లాస్థాయి అధికారులు
- మండలాల్లో పర్యవేక్షకులుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు
- 13 పురపాలక సంఘాలు, 61 జీపీల్లో సభల నిర్వహణకు 306 టీమ్‌లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజలకు పాలన చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రజా పాలన' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా, నిర్ణీత వ్యవధిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఆరు గ్యారంటీల్లో భాగంగా అందజేసేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే గ్రామ పంచాయతీలు, వార్డు/డివిజన్ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి మిగతా ఎనిమిది రోజుల్లో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులు/డివిజన్లలో ప్రజాపాలన సభలు జరిగేలా అధికార యంత్రాంగం కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించింది. క్షేత్రస్థాయిలో జవాబుదారితనం, పారదర్శకతతో కూడిన మెరుగైన పరిపాలనను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అందించడమే లక్ష్యంగా నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా జిల్లా యంత్రాంగం రూపకల్పన చేసింది.

ఈ పథకాలకు మాత్రమే.. దరఖాస్తుల స్వీకరణ..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సభలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకం, యువ వికాసం తదితర పథకాలకు అర్హులైన ప్రజల నుంచి సంబంధిత అధికారులు దరఖాస్తులు తీసుకుంటారు. సభల్లో దరఖాస్తుల స్వీకరణ కోసం మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలతో పాటు కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. భారీ సంఖ్యలో దరఖాస్తుదారులు ఉన్నట్లయితే.. టోకెన్ విధానాన్ని అధికారులు అనుసరిస్తారు.

నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లు..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పురపాలక సంఘాల్లో సభల విజయవంతానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లాస్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. అందులో భాగంగానే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఉప్పల్‌కు యువజన, క్రీడా విభాగం అధికారి బలరామారావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురామ్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీని నియమించారు. ఈ స్పెషల్ ఆఫీసర్లు తమ నియోజకవర్గం పరిధిలోని గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల్లో సభలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటారు. సభలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తారు.

సభల సక్సెస్‌కు 306 టీమ్‌లు

ప్రజాపాలన సభలు సక్సెస్ కావడానికి జిల్లా అధికార యంత్రాంగం 306 టీమ్‌లను నియమించింది. జిలాల్లోని 61 గ్రామ పంచాయతీల్లో సభలకు నిర్వహణకు 10 టీమ్‌లను ఖరారు చేసిన అధికార యంత్రాంగం.. 13 పురపాలక సంఘాల పరిధిలోని 289 వార్డులు/డివిజన్లలో సభలు నిర్వహించేందుకు 296 టీమ్‌లను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘాల్లో సభల సక్సెస్ కోసం మండల తహసీల్దార్లు, గ్రామ పంచాయతీల్లో సభల విజయవంతానికి ఎంపీడీఓలు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరని చెప్పకపోయినా..

తహసీల్దార్ కార్యాలయాలుకు క్యూ కడుతున్న జనం



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జనం

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలకు ప్రభుత్వం నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని చెప్పక ముందే వాటిని తీసుకోవడానికి జనాలు ఎగబడుతున్నారు. పది రోజుల నుంచి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం దరఖాస్తుదారులతో కిక్కిరిసిపోతోంది. ఇటీవల తాజాగా 6 పథకాలపై ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ఎక్కడికక్కడ స్థానికంగా ప్రజాపాలన కార్యక్రమం పేరిట ఆయా పథకాల్లో దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి మరింత తాకిడి పెరిగింది. ఒక్క రోజుకు 700 నుంచి 800 దరఖాస్తులు రావడం విశేషం. ఈ పథకాలకు తప్పనిసరిగా కుల, ఆదాయ సర్టిఫికెట్ అవసరమని ప్రభుత్వం ఎక్కడ పేర్కొన లేదు. అయినప్పటికీ కార్యాలయం తెరవక ముందే ఉదయం 9గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయాల వద్ద జనం క్యూ కడుతున్నారు.